# నవభూమి

## మెదక్

అనుబంధం

26 సెప్టెంబర్,2024 గురువారం పేజీలు:4

www.epaper.navabhoomi.in




# వంట..తంట



**సిద్దిపేట-నవభూమి :** ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల్లో పోషకాహార లోపాన్ని నివారించేందుకు, ఆకలితో విద్యార్థులు అలమటించకుండా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తున్న సంగతి తెలిసిందే. రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి వచ్చాక మధ్యాహ్న భోజన పథకం నీరుగారుతున్నది. భోజనం వండిపెడుతున్న కార్మికులకు నాలుగు నెలల నుంచి బిల్లులు రాకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బయట అప్పులు తెచ్చి మధ్యాహ్న భోజనం వండి పెడుతున్నారు. నాలుగు నెలలుగా పెండింగ్‌లోనే బిల్లులు ఉండడంతో వచ్చే బిల్లులు వడ్డీలకే సరిపోతున్నాయని కార్మికులు వాపోతున్నారు. వంట వండడం కష్టంగా ఉందని జిల్లాలో పాఠశాలలో పనిచేస్తున్న భోజన కార్మికులు చెబుతున్నారు. బుధవారం(నేడు) సిద్దిపేట జిల్లా లో రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులను, ఎంఈవోలను, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులను జి ల్లా విద్యాశాఖ అలర్ట్ చేసింది. కమిషనర్ పర్యటన నేపథ్యంలో ప్రతి పాఠశాలను శుభ్రంగా ఉంచాలని, ఆ రోజు ఉన్న మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం రుచి గా, శుచిగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కిచెన్‌షెడ్ పరిసరాలు, చుట్టుపక్కల వా తావరణం బాగుండేలా చూసుకోవాలని ఆదేశించారు. దీనిని బట్టి చూస్తే మిగతా రోజుల్లో మెనూ అమలు కావడం లేదని తెలుస్తున్నది. నాణ్యమైన భోజనం పెట్టడం లేదా ..? అనే సందేహాలు కలుగుతున్నాయి.

**ధరాఘాతంతో విలవిల..**

మార్కెట్‌లో పెరుగుతున్న నిత్యవసర సరుకుల ధరలు అందరికీ చుక్కలు చూపిస్తున్నాయి. ఇటీవల నూనెల ధరలు బాగా పెరిగాయి. పెరిగిన నిత్యవసర సరుకుల ధరలతో మధ్యాహ్న భోజనం వండడం కష్టం గా మారిందని భోజన కార్మికులు వాపోతున్నారు. పెరిగిన ధరలతో సరుకులు కొనలేని పరిస్థితులు ఉన్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక మధ్యాహ్న భోజన కార్మికులకు ఇవ్వాల్సిన బిల్లులు పెండింగ్‌లో పెట్టింది. నాలుగు నెలలుగా కోడిగుడ్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. బిల్లులు రాకపోవడంతో మధ్యాహ్న భోజన అమలు లక్ష్యం నీరుగారుతున్నది. ఉన్న సరుకులతో పిల్లలకు వండిపెడుతున్నామని, బయట వడ్డీలకు ఎంతగానం డబ్బులు తెస్తామంటూ కార్మికులు చెబుతున్నారు. ప్రతినెలా సరిగ్గా ప్రభుత్వం బిల్లులు చెల్లిస్తే పిల్లలకు నాణ్యమైన భోజనం పెట్టడానికి అవకాశం ఉంటుందని చెబుతున్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా తమకు కమీషన్ పెంచాలని కార్మికులు కోరుతున్నారు. ఒకవైపు బిల్లులు అందక ఇక్కట్లు పడుతుంటే%ఔ%మరోవైపు మెనూ సరిగ్గా పాటించి నాణ్యమైన భోజనం పెట్టాలని అధికారులు ఆదేశిస్తున్నారు. ఇదే సమయంలో పెండింగ్ బిల్లులు చెల్లిస్తే కార్మికులు కూడా మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం పెట్టడానికి అవకాశం ఉంటుంది. ఈ విషయాన్ని అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం లేదని కార్మికులు ప్రశ్నిస్తున్నారు. సిద్దిపేట జిల్లాలో మొ త్తం 921 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నా యి. వీటిలో 73,246 మంది విద్యార్థులు చదువుతున్నారు. మధ్యాహ్న భోజనం తింటున్న విద్యార్థుల సంఖ్య ను చూసుకుంటే 69 వేల మంది ఉంటారని అధికారుల లెక్కలు చెబుతున్నాయి. ఈ పిల్లలకు వంట వండడానికి జిల్లాలో మొత్తం 1982 మంది మధ్యాహ్నభోజన కార్మికులు పనిచేస్తున్నారు. ప్రతినెలా రూ. 60 లక్షల వరకు ఖర్చు చేస్తున్నారు. ఒక్కో విద్మార్థికి ప్రభుత్వం 1వ తరగతి నుంచి 5వ వరకు రూ. 10.45 డబ్బులు చెల్లిస్తున్నది. 6వ తరగతి నుంచి 8వ వరకు రూ. 13.17 చెల్లిస్తున్నది. 9వ, 10వ తరగతుల విద్యార్థులకు రూ. 10.67 చొప్పు న చెల్లిస్తున్నది. 1వ తరగతి నుంచి 8వ తరగతి వరకు కోడిగుడ్డు చార్జీల విషయంలో వేర్వేరుగా చెల్లిస్తున్నారు. కోడిగుడ్ల చార్జీలు నాలుగు నెలలుగా పెండింగ్‌లో ఉన్న ట్లు మధ్యాహ్న భోజన కార్మికులు చెబుతున్నారు. నూనె లేనిది వంట పూర్తికాదు.

## క్రస్ట్ గేట్ ఎత్తి దిగువకు

# నీటి విడుదల



**పుల్కల్-నవభూమి :** ఇటీవల కురిసిన భారీ వర్షాలతో సంగారెడ్డి జిల్లాలోని బాగారెడ్డి సింగూరు ప్రాజెక్టు నీటితో నిండి కళకళలాడుతోంది. కొన్ని రోజులుగా కురిసిన వర్షాలు కాస్త తగ్గు ముఖం పట్టడంతో ప్రాజెక్టులోకి వచ్చే వరద సైతం తగ్గింది. ఉన్నట్టుండి సోమవారం వరద తీవ్రత పెరగడంతో అప్రమత్తమైన నీటిపారుదలశాఖ అధికారులు 11వ గేటు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల వల్ల ప్రాజెక్టులోకి వరద పెరిగిందని ఏఈ మహిపాల్‌రెడ్డి వెల్లడించారు. ప్రాజెక్టులోకి వరద అధికంగా వస్తున్న కారణంగా అధికారులు అప్రమత్తమై ఎప్పటికప్పుడు నీటి హెచ్చుతగ్గులను గమనిస్తూ ప్రాజెక్టు క్రస్ట్ గేట్ ఎత్తి దిగువకు విడుదల చేస్తున్నారు. అందులో భాగంగానే మంగళవారం కూడా ప్రాజెక్టులోకి వరద కొనసాగుతుండటంతో అధికారులు 11వ గేటు 1.50 మీటర్ల ఎత్తు లేపి 4919 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతుండగా, 2823 క్యూసెక్కుల నీటిని విద్యుత్ ఉత్పత్తి కోసం వదులుతున్నట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 29.917 టీఎంసీలు ఉండగా, ప్రస్తుతం ప్రాజెక్టులో నీటి నిల్వ 29.857 టీఎంసీలుగా ఉన్నది. ప్రాజెక్టులోకి 9967 క్యూసెక్కుల నీ రు వరద రూపంలో వస్తుండగా, అవుట్‌ఫ్లో 8243 క్యూసెక్కుల నీరు దిగువకు వెళ్తున్నట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు.

# సేవకుడిగా పనిచేస్తా

## ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి



**మెదక్-నవభూమి :** ఉద్యోగులు, యువత కోసం సేవకుడిగా పనిచేస్తానని, నిరంతరం అందరికీ అందుబాటులో ఉంటానని మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి, అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మెదక్ జిల్లా కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 34 ఏండ్లుగా వేలాది మంది విద్యార్థులను ఉన్నత పౌరులుగా తీర్చిదిద్దానన్నారు. అల్ఫోర్స్ విద్యాసంస్థల్లో ఐదువేల మంది ఉద్యోగులు ఉంటారని, 1.70 లక్షల మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారన్నారు. నిరుద్యోగులు, యువత కోసం పెద్దల సభలో వాణి వినిపించడానికి పట్టభద్రుల నియోజకవర్గం నుంచి ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేయడానికి సిద్ధంగా ఉన్నానన్నారు. మెదక్ జిల్లాలో పట్టభద్రులు లక్ష వరకు ఉన్నారని, గతం లో జిల్లాలో 17వేల మంది మాత్రమే ఎన్‌రోల్ చేసుకున్నారని, గతంలో గెలిచిన ఎమ్మెల్సీలు పట్టభద్రుల పక్షాన లేకపోవడం వల్ల ఎన్‌రోల్ తగ్గిందని, గత సంవత్సరం ఓటు వేసిన వారు మళ్లీ ఫామ్-18 ద్వారా కొత్తగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. 2021 కంటే ముందు డిగ్రీ పూర్తయిన వారు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసేందుకు నమో దు చేసుకోవాలన్నారు.

# సూర్యాపేట గుండెల్లో హైడ్రా పిడుగు



# దేవాదాయ శాఖ మంత్రిని కలిసిన చెరుకు శ్రీనివాస్ రెడ్డి



**తొగుట– నవభూమి :**దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ ను బుధవా రం కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గం ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి శాలువతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తదితరులు ఉన్నారు.

# 30 సార్లు రక్తదానం చేసిన ఉపాధ్యాయుడు..



**దుబ్బాక–నవభూమి :** రక్తదానం చేసి ఆపదలో ఉన్న ఎందరికో ప్రాణదానము చేసిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఇస్తారిగల్ల పవన్ సేవలు ప్రశంసనీయమని దుబ్బాక ఎంఈవో ప్రభుదాస్,పలువురు కొనియాడారు. దుబ్బాక మండలం బల్వంతాపూర్ మండల ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న ఇస్తరిగల్ల పవన్ బుధవారం సురభి మెడికల్ ఆసుపత్రిలో రక్తం అత్యవసరం ఉన్న రోగికి తన రక్తాన్ని అందించి రోగి ప్రాణాలు రక్షించాడు. ఐతే ఇప్పటికి వరకు 30 మందికి ఓ నెగిటివ్ రక్త గ్రూప్ రక్తాన్ని అందించి ప్రాణాలు కాపాడడంతో మాదిగ ఉద్యోగుల ఫెడరేషన్ జిల్లా కమిటీ పవన్ ను, దళిత జర్నలిస్ట్ నాయకులు అభినందించారు.

# తడి, పొడి చెత్త వేరు చేసి మున్సిపల్ వాహనానికి ఇవ్వాలి



**హుస్నాబాద్‌– నవభూమి :** తడి, పొడి చెత్త వేరు చేసి మున్సిపల్ వాహనానికి అందించి స్వచ్ఛ హుస్నాబాద్ కు సహకరించాలని మున్సిపల్ రెండో వార్డు కౌన్సిలర్ బోజు రమాదేవి రవీందర్ అన్నారు. బుధవారం హుస్నాబాద్ పట్టణంలోని రెండవ వార్డులో ఇంటింటికి తిరుగుతూ తడి చెత్త పొడి చెత్త వేరు చేయాలని అవగాహన కల్పించారు. అన్నం కట్ చేసిన కూరగాయలు ఇతర ఏ పదార్థాలైనా మోరీలు వేయరాదని తెలిపారు..ఈ కార్యక్రమంలో ఇన్వాల్వ్మెంట్ ఆఫీసర్ రవి, వార్డ్ ఆఫీసర్ శంకర్ ,ఆర్ పి శ్రీలత ,ఆశ కార్యకర్త జాల వాణి, అంగన్వాడి టీచర్ జాల సరిత పాల్గొన్నారు.

# టపాసులు కాలుస్తుండగా బాల కార్మికుడికి గాయాలు

**శివ్వంపేట–నవభూమి :** పంటను కోతులు, పిట్టల బెరద నుంచి రక్షించేందుకు టపాసులు కాలుస్తుండగా బాల కార్మికుడి చేతికి గాయాలయ్యాయి. ఈ సంఘటన మెదక్ జిల్లా శివ్వంపేట మండలం గంగయ్యపల్లిలో ఆలస్యంగా వెలుగుచూసింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గంగయ్యపల్లిలోని ఆర్ఎన్‌డీఏ విత్తన పరిశ్రమలో యశ్వంత్(16) పనిచేస్తున్నాడు. అయితే పరిశ్రమ యాజమాన్యం కోతుల, పిట్టల బెడద నుంచి పంటను రక్షించేందుకు సుతిలి బాంబు టపాసులు కాల్చమని యశ్వంత్‌ను ఆదేశించారు. అతడు బాంబులు కాలుస్తుండగా చేయికి నిప్పు తగిలి గాయాలయ్యాయి. దీంతో పరిశ్రమ యాజమాన్యం గుట్టుచప్పుడు కాకుండా యశ్వంత్‌ను ఆస్పత్రిలో చికిత్స చేయించి ఇంటికి పంపించారు. బాల కార్మికుడితో పని చేయించడమే కాకుండా.. టపాసులు కాల్పించిన పరిశ్రమ యజమానిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## మట్టి పరీక్షలు చేయనున్న

# కొత్లాపూర్ విద్యార్థులు

**సంగారెడ్డిౕనవభూమి** :పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు ఆచరణాత్మక వ్యవసాయ విద్యను నేర్పించేందుకు కేంద్ర వ్యవసాయ శాఖ 'స్కూల్ సాయిల్ హెల్త్ ప్రోగ్రామ్' ప్రారంభించింది. ఇందులో భాగంగా తెలంగాణలోని 44 ప్రభుత్వ పాఠశాలల్లో పైలెట్ ప్రాజెక్టు కేంద్ర వ్యవసాయశాఖ చేపట్టింది. సంగారెడ్డి జిల్లాలోని కొత్లాపూర్ ప్రభుత్వ జడ్పీ ఉన్నత పాఠశాల స్కూల్ సాయిల్ హెల్త్ ప్రోగ్రామ్ పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపికైంది.కొత్లాపూర్‌లోని ప్రభుత్వ పాఠశాలకు చెందిన 7,8,9, 10వ తరగతుల్లో ఎంపిక చేసిన విద్యార్థులు సొంత గ్రామంలో మట్టి నమూనాల సేకరణ, మట్టి పరీక్షల నిర్వహణ, సాయిల్ హెల్త్‌కార్డుల తయారీ చేపట్టనున్నారు. ఇందుకోసం సంగారెడ్డిలోని వ్యవసాయశాస్త్రవేత్తలు, సాయిల్ టెస్టు లేబొరేటరీ అధికారులు మంగళవారం కొత్లాపూర్ ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు స్కూల్ సాయిల్ హెల్త్ ప్రోగ్రామ్‌పై అవగాహన కల్పించారు.జిల్లా వ్యవసాయశాఖ అధికారి శివప్రసాద్, వ్యవసాయశాస్త్రవేతలు డాక్టర్ రాహుల్, డాక్టర్ వరప్రసాద్, సాయిల్ టెస్టు లేబొరేటరీ ఏడీఏ అంబికాసోనీ సాయిల్ హెల్త్, మట్టి నమూనా పరీక్షల ఆవశ్యకత గురించి విద్యార్థులకు వివరించారు. మట్టి పరీక్షల నిర్వహణకు త్వరలోనే ప్రత్యేక కిట్లు అందజేయడంతోపాటు సాయిల్ హెల్త్‌రిపోర్టుల తయా రు కోసం ప్రత్యేకంగా ఆన్‌లైన్ యాప్‌ను అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ అధికారులు అంబికాసోనీ, వెంకటలక్ష్మి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విజయకుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.



# పాడి రైతు విలవిల

**నిజామాబాద్ౕనవభూమి :** ప్రభుత్వ ఆధ్వర్యంలోనడిచే విజయ డెయిరీ నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో వేలాది పాడి రైతుల నుంచి పాలను సేకరిస్తుంది. పాల కేంద్రాల నుంచి శీతలీకరణ కేంద్రాలకు తరలించి అక్కడి నుంచి ప్యాకెట్ల ద్వారా టోన్డ్ పాలను సరఫరా చేస్తుంటారు. బహిరంగ మార్కెట్లో ప్రజలకు పాల ప్యాకెట్లను విక్రయించి విజయ డెయిరీ వ్యాపారం చేస్తుంటుంది. అలాగే, పాల నుంచి తీసే కొవ్వుతో నెయ్యి, ఇతరత్రా పదార్థాలను తయారు చేసి, విక్రయిస్తుంటుంది. అలా వచ్చిన డబ్బులను 15 రోజులకోసారి పాల రైతులకు చెల్లించేది. కేసీఆర్ హయాంలో ఠంచన్‌గా బిల్లులు మంజూరయ్యేవి. కానీ, కాంగ్రెస్ సర్కారు రాకతో పాడి రైతులకు పరేషన్ మొదలైంది. సమయానికి పాల డబ్బు లు రాక ఆగమవుతున్నారు.

**5 బిల్లులు పెండిరేగ్..**

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో సుమారుగా 15 వేల మంది రైతుల పేర్లు విజయ డెయిరీలో నమోదై ఉన్నాయి. పాల సీజన్‌గా పరిగణించే సెప్టెంబర్ ఫిబ్రవరి మధ్య కాలంలో దాదాపు పది వేల మంది పాలను విక్రయిస్తున్నారు. అన్‌సీజన్‌లో అంటే మార్చి %–% ఆగస్టు వరకు 5 వేల మంది మాత్రమే పాలు పోస్తుంటారు. పక్షం రోజులకోసారి బిల్లులు చెల్లించాల్సిన విజయ డెయిరీ మూడు నెలలుగా పాడి రైతులకు చుక్కలు చూపిస్తున్నది.ఉమ్మడి జిల్లాలోని వేలాది మందికి జూలై, ఆగస్టు, సెప్టెంబర్ నెలలకు సంబంధించి 5 బిల్లులు చెల్లించాల్సి ఉంది. రూ.లక్షల్లో బిల్లులు పేరుకుపోవడంతో రైతులకు తిప్పలు తప్పడం లేదు. రైతుల నుంచి సేకరించే పాలతో వ్యాపారం చేస్తున్న విజయ డెయిరీ వారికి ఇవ్వాల్సిన డబ్బులను మాత్రం ఇవ్వడం లేదు. పాల డబ్బులు ఎప్పుడు ఇస్తారని ప్రశ్నిస్తే సరైన సమాధానాలు ఇవ్వడం లేదని రైతులు వాపోతున్నారు.

**పాల ఉత్పత్తికి ఆటంకం..**

ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి మూలంగా పాల ఉత్పత్తిపై తీవ్ర ప్రభావం పడనున్నది. గతంలో కేసీఆర్ సర్కారు పాడి రైతులను విరివిగా ప్రోత్సహించింది. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా పాల అవసరాలను తీర్చేందుకు విజయ డెయిరీని బలోపేతం చేశారు. కానీ ఇప్పుడు పాడి రైతులకు ప్రోత్సాహం కరువైంది. వారికి పాల డబ్బులే సమయానికి ఇవ్వకపోగా నెలల కొద్దీ బిల్లులు పెండింగ్‌లో పెట్టడం ద్వారా రైతులంతా గందరగోళంలో ఉన్నారు.బ్యాంకుల్లో, మహిళా సంఘాల్లో, వడ్డీ వ్యాపారుల దగ్గర పాడి రైతులు చేసిన అప్పులకు క్రమం తప్పకుండా కిస్తీలు కట్టాల్సి ఉండగా, డబ్బుల్లేక ఆందోళన చెందుతున్నారు. మరోవైపు, పశువులకు దాణా, మింద్రాల్ మిక్చర్, కాల్షియం, మందుల కొనుగోలుకూ చిల్లిగవ్వ లేదని వాపోతున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే పశువుల పోషణపై తీవ్ర ప్రభావం చూపి, పాల ఉత్పత్తికి ఆటంకం కలిగే ప్రమాదం ఉందని రైతులు చెబుతున్నారు.

**సకాలంలో బిల్లులు చెల్లించాలి..**

కోటగిరి, సెప్టెంబర్ 23: ప్రభు త్వం, అధికారుల నిర్లక్ష్యంతో అనేక కష్టాలు పడుతున్నాం. 15 రోజులకోసారి పాల బిల్లులు ఇ వ్వాల్సి ఉండే. మూడు నెలల నుంచి ఇస్తలేరు. నాకు రూ.70 వేల కు పైగా రావాలి.. బిల్లులు ఇవ్వకుంటే పశువులకు దా ణా ఎట్లా కొనాలే. కూలీలకు డబ్బులు ఎట్లా ఇయ్యాలే. ప్రభుత్వం వెంటనే స్పందించి పెండింగ్ బిల్లులు చెల్లించాలి.

**పైసలు ఇయ్యకుంటే ఎట్లా?**

పాల కేంద్రంలో పాలు పోస్తు న్నాం కానీ ప్రభుత్వం నుంచి బిల్లులైతే అస్తలేవు. పాలు తీసుకుని పైసలు ఇయ్యకుంటే ఎట్లా? నాకు రూ.45 వేలకు పైగా డబ్బులు అచ్చేది ఉన్నది. అధికారులు స్పందించి నాలుగు విడతల బిల్లులు వెంటనే ఇవ్వాలి.

**రూ.3లక్షల దాకా రావాలె..**

పాల రైతులకు ఎప్పటికప్పుడు బిల్లులు రావాల్సి ఉండే. కానీ ప్రభుత్వం బిల్లులు మంజూరు చేయక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కేంద్రంలో పాలు పోసే రైతులకు రూ.3లక్షలు బిల్లులు వచ్చేవి ఉన్నాయి. జూలై, ఆగస్టు, సెప్టెంబర్ దాకా నాలుగు బిల్లులు రావాలె. ప్రభుత్వం, అధికారులు స్పందించి పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలి.



# సూర్యాపేట గుండెల్లో హైడ్రా పిడుగు



**సూర్యాపేట-నవభూమి :** వారం రోజుల్లో బతుకమ్మ పండుగ.. ఆ వెంటనే దసరా.. పండుగ పూట అంతా సంతోషంగా ఉండాల్సిన సమయంలో సూర్యాపేటలో మాత్రం ఓ పదిహేను వందల కుటుంబాలకు కంటి మీద కునుకు కరువైంది. హైదరాబాద్‌లో జరుగుతున్న హైడ్రా కూల్చివేతలు ఇక్కడి వారిలో భయాందోళనలు నింపుతున్నాయి. జిల్లాకేంద్రంలోని సర్వే నెంబర్ 247లో ఉన్న సద్దుల చెరువు చుట్టూ శ్రీశ్రీనగర్, హైటెక్ కాలనీ, మానసనగర్, హైమానగర్, నెహ్రూనగర్, ఏవీ ఎన్‌క్లేవ్ కాలనీలు ఏర్పాటయ్యాయి.ఇవన్నీ అదే సర్వే నెంబర్‌లో ఉన్నాయంటూ మూడు రోజులుగా ఇరిగేషన్ అధికారుల బృందం చెరువు కట్ట నుంచి సుమారు రెండు వందల మీటర్ల దూరం అవతల ఎఫ్‌టీఎల్ జోన్‌గా మార్కింగ్ చేస్తున్నది. కాగా, పైసా పైసా పోగేసుకుని దశాబ్దాల క్రితం నిర్మించుకొని నివాసం ఉంటున్న తమ ఇండ్లను ఇప్పుడు కూల్చితే తమ పరిస్థితి ఏంటని ఆయా కుటుంబాలు తీవ్ర ఆందోళనలో ఉన్నాయి. పదిహేను రోజులుగా హైదరాబాద్‌లో చెరువులు, కుంటలను కబ్జా చేసి నిర్మాణాలు చేశారంటూ రేవంత్ సర్కార్ పొక్లెయిన్లు, డోజర్లు పెట్టి వందలాది పోలీసులతో పేద, మధ్య తరగతి ప్రజల నివాసాలపైకి యుద్ధం చేసినట్టుగా వెళ్లి కూల్చివేతలకు పాల్పడుతున్నారు.ముఫై, నలభై ఏండ్ల కింద నిర్మించుకున్న ఇండ్లను నిలువునా కూల్చేస్తున్నారు. ఈ దృశ్యాలు, బాధితుల ఆక్రందనలను చూస్తున్న జనం తల్లడిల్లుతున్నారు. ఆ కూల్చివేతలు జిల్లాల్లో ప్రారంభమైతే తమ పరిస్థితి ఏంటని కలవరపడుతున్నారు. మూడు రోజులుగా జిల్లా కేంద్రంలోని సద్దుల చెరువు చుట్టూ ఇరిగేషన్ అధికారులు చెరువుకు సంబంధించి సర్వే ద్వారా ఎఫ్‌టీఎల్ ఎంతవరకు ఉందో గుర్తించి మార్కింగ్ చేస్తుండగా సమీప ప్రాంతాల ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

**1,500 ఇండ్లకుపైనే ఎఫ్‌టీఎల్‌లో**

సర్వే నెంబర్ 247లో సద్దుల చెరువు 115 ఎకరాల్లో ఉండగా కుచించుకుపోయి నేడు సుమారు 80 ఎకరాలకు చేరింది. 25 ఏండ్ల క్రితమే చెరువు చుట్టూ కట్ట నిర్మాణం చేయగా బీఆర్‌ఎస్ హయాంలో మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి ఆ కట్టను ట్యాంక్‌బండ్‌గా తీర్చిదిద్దారు. చెరువు శిఖంలోకి 30 నుంచి 40 ఏండ్లుగా పేదలు కొద్దికొద్దిగా వచ్చి ఇండ్లు నిర్మించుకున్నారు. నేడు ఆ ప్రాంతాల్లో 1,500 వరకు ఇండ్లు ఉంటాయనేది అంచనా.చెరువు చుట్టూ శ్రీశ్రీనగర్, హైటెక్ కాలనీ, మానసానగర్, హైమానగర్, నెహ్రూనగర్, ఏవీ ఎన్‌క్లైవ్ కాలనీ ఉన్నాయి. ఇక్కడి ఇండ్లకు అధికారులు డోర్ నెంబర్లు ఇచ్చారు. చాలావరకు రిజిస్ట్రేషన్లు అయ్యాయి. రోడ్లు, డ్రైనేజీ, నల్లా కనెక్షన్, వీధి లైట్లు వంటి మౌలిక సదుపాయాలు కల్పించారు. ఆయా కాలనీల్లో పెద్దపెద్ద భవనాలు, అపార్ట్‌మెంట్ల నిర్మాణాలే కాదు ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లు సైతం నిర్మించారు.

**ఇప్పుడు వచ్చి మార్కింగ్**

30 నుంచి 40 ఏండ్ల క్రితం నిర్మించిన ఇండ్లు చెరువులో ఉన్నాయంటూ మూడు రోజులుగా ఇరిగేషన్ అధికారుల బృందం చెరువు కట్ట నుంచి సుమారు రెండు వందల మీటర్ల దూరం అవతల ఎఫ్‌టీఎల్ జోన్‌గా మార్కింగ్ చేస్తున్నారు. ఆయా కాలనీల్లో ఉన్న ఇండ్ల యజమానులతో మాట్లాడుతూ డోర్ నెంబరు, యజమాని పేరు వంటి వివరాలు తీసుకుంటున్నారు. దాంతో ఇక్కడి జనం కంటి మీద కునుకు ఉండడం లేదని వాపోతున్నారు.

**గుండెల్లో గుబులైతున్నది**

50 ఏండ్ల కింద ఇక్కడ ఇల్లు కట్టుకొని ఉంటున్నాం. ఇంటి నెంబర్ ఉంది. ప్రభుత్వాలు అన్ని సౌకర్యాలు కల్పించాయి. మరి ఇయ్యాల మా ఇంటికి అవతల ఎక్కడో టిక్కు పెట్టి అక్కడి వరకు చెరువు ఉందంటున్నారు. మా ఇంటిని కూల్చేస్తారో ఏమో అని గుండెల్లో గుబులైతున్నది. నేను దివ్యాంగురాలిని. ఉన్న ఇంటిని కూడా కూల్చితే నాకుచావే దిక్కు .

**నా ఇల్లు కూల్చాలంటే జేసీబీ నన్ను తొక్కుకుంటూ పోవాల్సిందే**

చెరువు శిఖం అంటూ అధికారులు గీతలు గీస్తున్నరంట! ఎవరైనా నా ఇండ్లు కూల్చేందుకు వస్తే జేసీబీతో నన్ను తొక్కి చంపిన తర్వాతే నా ఇంటి మీదికి పోవాల్సి ఉంటుంది. 30 ఏండ్ల కింద కట్టుకున్న ఇంటిని ఇప్పుడు కూల్తుతం అంటే నేనే కాదు.. ఎవరూ ఒప్పుకోరు.

# ధాన్యం కొనుగోళ్లకు యాక్షన్ ప్లాన్

**సూర్యాపేట-నవభూమి :** వాన కాలం సీజన్‌కు సంబంధించి ధాన్యం కొనుగోళ్లకు జిల్లా యంత్రాంగం సిద్ధమవుతున్నది. ఇందుకోసంకార్యాచరణ రూపొందించింది. ఈ సీజన్‌లో 4లక్షల టన్నుల ధాన్య సేకరణను లక్ష్యంగా నిర్దేశించుకుంది. గన్నీ బ్యాగులు, టార్పాలిన్లు, ధాన్యం రవాణాకు వాహనాలను రెడీ చేస్తున్నది. అక్టోబర్ రెండో వారం నుంచి ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు.వానకాలం సీజన్‌కు సంబంధించి జిల్లావ్యాప్తంగా 4,59,850 ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు అవుతున్నాయని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ఇందులో 2,85,000 ఎకరాల్లో వరి, 1,35,000 ఎకరాల్లో పత్తి, 8,500 ఎకరాల్లో పప్పు గింజలు, 200 ఎకరాల్లో మిల్లెట్స్, 150 ఎకరాల్లో నూనె గింజలు, 21వేల ఎకరాల్లో ఇతర పంటలను పేర్కొంది. జిల్లావ్యాప్తంగా 2.76 లక్షల ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. కొన్ని రోజుల్లో కోతలు కూడా షురూ కానున్నాయి. ఈ నేపథ్యంలో ధాన్యం కొనుగోళ్లకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలో 323 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అందులో 90 ఐకేపీ, 220 పీఏసీఎస్‌లు, 13 ఇతర కేంద్రాలను ప్రారంభించనున్నారు.

**కోటి గన్నీ బ్యాగులు అవసరం..**

ధాన్యానికి ప్రభుత్వం నిర్దేశించిన మద్దతు ధర దక్కాలంటే పలు సూచనలు పాటించాలని అధికారులు చెబుతున్నారు. ఏ గ్రేడ్ ధాన్యానికి క్వింటాకు రూ.2,320, కామన్ గ్రేడ్ రకానికి రూ.2,300 మద్దతు ధర కల్పించనున్నారు. సన్న ధాన్యం కింటాకు రూ.2,820 చెల్లించనున్నారు. జిల్లాలో మొత్తం కోటి గన్నీ బ్యాగులు అవసరం కానున్నాయి. ప్రస్తుతం 5,79,542 బ్యాగులు అందుబాటులో ఉండగా, ఇంకా 94,20,458 బ్యాగులు రావాల్సి ఉంది. 4,845 టార్పాలిన్లు, తూకం వేసే పరికరాలు, తేమను నిర్ధారించే మీటర్లు అందుబాటులో ఉంచనున్నారు. మిల్లుల వద్ద రైతులకు ఇబ్బందులు కలుగకుండా పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులను నియమించనున్నారు.

**6లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి..!**

జిల్లాలో 6,16,507 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇందులో 5,46,143 మెట్రిక్ టన్నులు దొడ్డు రకం, 70,364 మెట్రిక్ టన్నులు సన్నాలు వస్తాయని భావిస్తున్నారు. ప్రభుత్వం 4 లక్షల మెట్రిక్ టన్నుల మేర కొనుగోళ్లు చేసే అవకాశం ఉందని తెలుస్తున్నది. ఇందులో 3,67,636 మెట్రిక్ టన్నుల దొడ్డు వడ్లు కొనాలని అధికారులు అనుకుంటున్నారు. అక్టోబర్‌లో 12,234 ఎంటీలు, నవంబర్‌లో 2,73,766, డిసెంబర్‌లో 1,140,00 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని ప్రణాళిక సిద్ధం చేసుకున్నారు. జిల్లాలో 51 మిల్లులు ఉండగా, 10 రా, 41 బాయిల్డ్ మిల్లులు ఉన్నాయి. వాటిల్లో 3,35,500 టన్నులు ధాన్యం నిల్వ చేసే సామర్థ్యం ఉంది. డిఫాల్ట్ అయిన రైస్ మిల్లులకు ధాన్యం కేటాయింపులు ఉండవు. కాగా, గత ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి 22శాతం, రబీకి సంబంధించి 62శాతం సీఎంఆర్ డెలివరీ చేయాల్సి ఉంది.

**అక్టోబర్ రెండో వారం నుంచి కొనుగోళ్లు..**

జిల్లాలో ధాన్యం కొనుగోళ్లకు ఏర్పాట్లు చేస్తున్నాం. ఇప్పటికే సమీక్షలునిర్వహిస్తున్నాం. ఆరు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేస్తున్నాం. ఇందులో 4 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. 323 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నాం. గన్నీ బ్యాగులు, టార్పాలిన్లు అందుబాటులో ఉంచేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం.



## కేటీఆర్ ను కలిసిన మాజీ ఎమ్మెల్యే



**హుస్నాబాద్-నవభూమి :** బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ మంత్రి కె టి ఆర్ ను మంగళవారం తెలంగాణ భవన్ హైదరాబాద్ లో హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రస్తుత నియోజకవర్గంలో నెలకొన్న రాజకీయ పరిస్థితులపై రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలపై అనుసరించాల్సిన వ్యూహం పార్టీకి క్యాడర్ ను చేయాల్సిన సమాయత్తంపై మాజీ మంత్రి కేటీఆర్ తో చర్చించినట్లు మాజీ ఎమ్మెల్యే సతీష్ తెలిపారు. రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి హుస్నాబాద్ నియోజకవర్గం లో ఎక్కువ మంది పట్టభద్రులను ఎన్రోల్ చేయించాలని పార్టీ అధిష్ఠానం నిర్ణయం తీసుకున్న విధంగా పనిచేయాలని, బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి గెలుపు కోసం శ్రమించాలని, పలు కీలక అంశాలను మాజీ మంత్రి దిశా నిర్దేశం చేసినట్లు చెప్పారు.

## విద్యుత్ షాక్‌తో రైతు మృతి



**దుబ్బాక-నవభూమి :** పొలం దగ్గర గడ్డికోస్తుండగా ప్రమాదవశాత్తు కేబుల్ వైరు తగిలి రైతు అక్కడిక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన మండల పరిధిలోని రఘోత్తం పల్లి గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. మంగళవారం దుబ్బాక ఎస్ఐ గంగరాజు తెలిపిన వివరాల ప్రకారం గౌరి అంజయ్య (71) వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. సోమవారం సాయంత్రం తన పొలం వద్దనున్న బోరు మోటారు దగ్గర కొడవలితో గడ్డి కోస్తుండగా ప్రమాదవశాత్తు చూడకుండా కేబుల్ వైరు తెగి ఎడమ చేతికి తగిలింది. కరెంట్ షాక్ తో తన తండ్రి కొట్టుకోవడాన్ని గమనించిన నరేష్ షాటర్ డబ్బాలోని ఫ్యూసులు తీసేసి చూడగా అప్పటి మృతి చెందాడు. షాక్ కు గురైన మృతుడి కుమారుడు నరేష్ ఏడుపులు విన్న బాబాయ్ వచ్చి చూసి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో మృత దేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం దుబ్బాక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం మృతుడి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## యాదగిరిగుట్ట ప్రసాదాలపై అప్రమత్తం..

**యాదగిరిగుట్ట-నవభూమి :** తిరుమల తిరుపతి దేవస్థానం లడ్డూ తయారీలో వినియోగించే నెయ్యి కల్తీ జరిగిందన్న నేపథ్యంలో యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయ అధికారులు అప్రమత్తమయ్యారు. స్వామివారి ప్రసాదంలో వినియోగిస్తున్న నెయ్యి నమూనాలను హైదరాబాద్‌లోని ఆహార ప్రయోగశాలకు పంపించారు. ఈ నెయ్యిలో ఏదైనా కల్తీ జరిగిందా.. అని తెలుసుకునేందుకు పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ పరీక్షలకు సంబంధించిన నివేదిక ఈ నెల 30లోపు వస్తుందని ఆలయ ఈఓ భాస్కర్‌రావు తెలిపారు. కాగా, దేవస్థానంలోని లడ్డూ ప్రసాదాల తయారీలో 40 ఏండ్లుగా నార్మూల్ సంస్థకు చెందిన నెయ్యిని వినియోగిస్తున్నారు. నెలకు సుమారు 20 నుంచి 25 వేల కిలోల నెయ్యిని వాడుతున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. ఒక్కో లడ్డూకు 90 నుంచి 100 గ్రాముల నెయ్యిని వినియోగిస్తున్నారు. దాంతోపాటు లడ్డూ తయారికి కావాల్సిన యాలకుల పొడి, జీడిపప్పు, కిస్మిస్ పొడి, చక్కెర పాకం, బూంది వంటి ముడి సరుకులు సైతం తాజాగా సేకరించి వినియోగిస్తున్నారు



# ఫార్మాసిటీ ఏర్పాటుపై ఆరా



**జహీరాబాద్-నవభూమి :** సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలంలోని డప్పూర్, వడ్డి, మల్గి గ్రామాల శివారులో 2003 ఎకరాల్లో ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న ఫార్మాసిటీ నుంచి వెలుబడే కాలుష్యం వల్ల అనేక ఇబ్బందులు పడాల్సివస్తుందని రైతులు, ప్రజలు ఆందోళన వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ఇటీవల ఫార్మాసిటీకి వ్యతిరేకంగా ఆయా గ్రామాలకు చెందిన నాయకులు, రైతులు, ప్రజలు నిరసన కార్యక్రమాలు చేపట్టి సంబంధిత జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు.ఫార్మాసిటీ ఏర్పాటు వల్ల విడుదలయ్యే కాలుష్యం, వ్యర్థజలాలతో మంజీరానదికి ప్రమాదం పొంచి ఉందా లేదా అనే వాస్తవ పరిస్థితులు తెలుసుకునేందుకు మంగళవారం జిల్లా కాలుష్య నియంత్రణ మండలి రీజినల్ మేనేజర్ గీత సందర్శించారు. ఆయా గ్రామాల పరిధిలోని భూములు, నీటి వనరులు కాలుషితమవుతాయా లేదా అనే వాస్తవ పరిస్థితులపై మండలంలోని డప్పూర్ గ్రామ శివారులోని చెరువు, న్యాల్‌కల్, నక్కల, కోట, చాకలి వాగులు, చినిగేపల్లి ప్రాజెక్టు, వాల్గి గ్రామ శివారులోని మంజీరానది తీరాన్ని పరిశీలించారు. నాయకులు, బాధిత రైతులు ఫార్మాసిటీ ఏర్పాటుతో కలిగే ఇబ్బందులను ఆమెతో మొరపెట్టుకున్నారు. ఆమె వెంట మండల డి ప్యూటీ తహసీల్దార్ రాజిరెడ్డి, ఆర్ఐ శ్యామ్‌రావు, బాధిత రైతులు, ప్రజలు ఉన్నారు

# మెదక్ స్టేడియానికి ఇందిరాగాంధీ పేరెలా కొనసాగిస్తారు..?: బీజేపీ



మెదక్-నవభూమి : మెదక్ స్టేడియానికి ఎలాంటి ఆధారాలు లేకుండా ఇందిరాగాంధీ పేరెలా కొనసాగిస్తారని, వెంటనే శిలాఫలకంపై పేరు తొలగించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంగళవారం అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, డీవైఎస్‌వో దామోదర్‌రెడ్డిని కలిసి ఆయన వినతిపత్రాలు అందజేసి మాట్లాడారు. మెదక్ నుంచి ఇందిరాగాంధీ గెలిచి ప్రధాని అయితే ఈ ప్రాంతానికి చేసింది ఏమిలేదన్నారు. అప్పటి మంత్రి కరణం రాంచంద్రరావు విజ్ఞప్తి మేరకు ఎన్టీఆర్ హయాంలో స్టేడియాన్ని మంజూరు చేయించారన్నారు. 2000 సంవత్సరంలో సీఎం నారా చంద్రబాబు హయాంలో స్టేడియాన్ని ప్రారంభించారని గుర్తుచేశారు. అప్పటి నుంచి మెదక్ స్టేడియంగానే కొనసాగుతోందన్నారు. 2018లో ప్రధాని మోదీ సర్కార్ సింథటిక్ ట్రాక్ నిర్మాణానికి రూ.5.50 కోట్లను ఖేలో ఇండియా ద్వారా మంజూరు చేసిందన్నారు. అప్పటి రాష్ట్ర మంత్రి హరీశ్‌రావు లోపల కాంగ్రెస్.. బయట బీఆర్ఎస్‌లా వ్యవహరించి అధికారులను తప్పుతోవ పట్టించారని ఆరోపించారు

# భారీ వర్షం

**పరిగి-నవభూమి :** పరిగి పట్టణంతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో మంగళవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. సాయంత్రం 4 గంటల నుంచి అరగంటకు పైగా వర్షం కురియడంతో పరిగి సమీపంలోని వాగు వరద నీటితో ప్రవహించింది. మండలంలోని పలు గ్రామాల్లో సైతం వర్షం కురిసింది. అలాగే రాత్రి 7.30 గంటల నుంచి మళ్లీ వర్షం కురిసింది. వరద నీరు లఖ్నా పూర్ ప్రాజెక్టులోకి చేరింది.బొంరాస్‌పేట మండలంలో మంగళవారం భారీ వర్షం కురిసింది. ఆది, సోమవారాల్లో కూడా మోస్తరు వర్షం కురిసింది. వర్షాలకు పెద్ద చెరువు పూర్తిగా నిండి అలుగు పారుతున్నది.



# పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం




**మిర్యాలగూడ-నవభూమి :** తొమ్మిది నెలలుగా కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో రాష్ట్రంతోపాటు ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పాలన పడకేసిందని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. మంగళవారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు నల్లమోతు భాస్కర్‌రావు, తిప్పన విజయసింహారెడ్డితో కలిసి మీడియాతో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని తిరోగమనంలో నడుపుతున్నదని, ప్రస్తుత ప్రభుత్వం తెలంగాణకు కొత్తగా చేసిందేమీ లేదని విమర్శించారు. ఉన్న వ్యవస్థలను కూడా సరిగ్గా నడపలేకపోతుందన్నదని విమర్శించారు. రాష్ట్రంలో విద్య, వైద్య రంగాలను నాశనం చేసిందని, కనీసం రైతుల సాగు నీళ్లు కూడా ఇవ్వలేని దుస్థితిలో ఉందని పేర్కొన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఉన్న ఇద్దరు మంత్రులు అవగాహన లేదని దద్దమ్మల్లా ఉన్నారన్నారు. వారికి అక్రమ సంపాదన, బ్లాక్ మెయిలింగ్ తప్ప పరిపాలన మీద సోయిలేదన్నారు. జిల్లా మంత్రుల నిర్లక్ష్యంతో సాగర్ నీళ్లన్నీ సముద్రం పాలు అవుతున్నాయన్నారు. 60 ఏండ్ల కాంగ్రెస్ పాలనలో ఉన్న పరిస్థితులు ఈ 9 నెలల్లో పునరావృతం అయ్యాయని పేర్కొన్నారు.ఖమ్మం జిల్లా మంత్రుల అత్యాశతో నాగార్జునసాగర్ కాల్వకు గండి పడిందన్నారు. ఎడమకాల్వకు గండి పడితే బీఆర్ఎస్ హయాంలో వారం రోజుల్లో నీటి సరఫరాను పునరుద్ధరించడాన్ని గుర్తు చేశారు. నేడు కాంగ్రెస్ పాలనలో గండ్లు పూడ్చడానికి 20 రోజులకు పైగా సమయం పట్టిందన్నారు. కాంగ్రెస్ తెచ్చిన జీఓ నెం.33తో సూర్యాపేట, నల్లగొండ జిల్లాలకు ఎక్కువ నష్టం వాటిల్లిందన్నారు. పదేండ్లలో వెయ్యికి పైగా గురుకులాలను, 30కిపైగా మెడికల్ కళాశాలలను కేసీఆర్ నాయకత్వంలో ప్రారంభించినట్లు తెలిపారు. ఇప్పుడు రైతులకు రైతుబంధు లేదు.. రైతు భరోసా లేదు.. పండించిన ధాన్యానికి రూ.500 బోనస్‌పైగా స్పష్టత లేదని విమర్శించారు.కౌలు రైతులు, వ్యవసాయ కూలీలకు రైతు భరోసా కింద డబ్బులు ఇస్తామని చెప్పి ఇప్పుడు ఆ ఊసే ఎత్తడం లేదన్నారు. ప్రభుత్వ దవాఖానల్లో మెరుగైన వైద్య సేవలు అందించడంలోనూ ప్రభుత్వం విఫలమైందన్నారు. జిల్లా మంత్రులు బీఆర్ఎస్ కార్యకర్తలపై తప్పుడు కేసులు పెట్టడమే పనిగా పెట్టుకున్నారని, ఇది సరైన విధానం కాదని పేర్కొన్నారు. వారికి మద్దతు ఇస్తున్న పోలీసు అధికారులు భవిష్యత్‌లో మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందన్నారు. బీఆర్ఎస్ హయాంలో వ్యవసాయ రంగంలో నల్లగొండ జిల్లాను దేశంలోనే అగ్రభాగాన నిలిపితే.. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో వెనక్కి తీసుకెళ్లిందన్నారు.సీఎం రేవంత్‌రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే రైతులకు రైతు భరోసా ఇవ్వాలని, రైతులందరికీ రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు న్యాయం జరిగేంత వరకు అన్నదాత పక్షాన బీఆర్ఎస్ కొట్లాడుతుందన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు దుర్గంపూడి నారాయణరెడ్డి, జొన్నలగడ్డ రంగారెడ్డి, ధనావత్ చిట్టిబాబునాయక్, కుందూరు వీరకోటిరెడ్డి, చిర్ర మల్లయ్యయాదవ్, యడవెల్లి శ్రీనివాస్‌రెడ్డి, పాలుట్ల బాబయ్య, హాతీరాంనాయక్, బాలాజీనాయక్, చౌగాని భిక్షంగౌడ్, సోము సైదిరెడ్డి, పూనాటి లక్ష్మీనారాయణ, ఎండీ షోయబ్ పాల్గొన్నారు.

# హామీలను మరిపించడానికే హైడ్రా నాటకం



**రామన్నపేట-నవభూమి :** ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయకుండా ప్రజల దృష్టిని మరల్చేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం హైడ్రా నాటకం ఆడుతుందని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య విమర్శించారు. మంగళవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆచరణ సాధ్యం కాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వానికి మహిళలు, రైతులు బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు.ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం మహిళలకు మహాలక్ష్మి పథకం కింద నెలకు రూ.2,500, కల్యాణలక్ష్మి కింద రూ.లక్షా పదహారు వేలతోపాటు తులం బంగారం, విద్యార్థినులకు స్కూటీలు, రైతులకు రైతు భరోసా ఎకరానికి రూ.15వేలు అందించాలని డిమాండ్ చేశారు. ఏడాది కాలంగా గ్రామపంచాయతీల నిర్వహణకు నిధులు ఇవ్వకపోవడంతో పారిశుధ్య నిర్వహణ, పైప్‌లైన్ల మరమ్మతుల కోసం కార్యదర్శులు లక్షల రూపాయలు అప్పులు తెచ్చి చేతి నుంచి ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు.కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేసేంత వరకు ప్రజల పక్షాన బీఆర్ఎస్ పార్టీ పోరాడుతుందన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి పోచబోయిన మల్లేశం, నాయకులు బందెల రాములు, బొక్కు మాధవరెడ్డి, సాల్వేరు అశోక్, మిర్యాల మల్లేశం, జాడ సంతోష్, బద్దుల రమేశ్, పున్న వెంకటేశం, ఆవుల నరేందర్, బాలగోని శివ, బట్టె కృష్ణమూర్తి, జాల అమరేందర్‌రెడ్డి, బొడ్డుపల్లి రాజు ఉన్నారు.

# రైతన్నకు బాసటగా ప్రభుత్వం

**నడిగూడెం-నవభూమి :** కాంగ్రెస్ ప్రభుత్వం రైతన్నకు బాసటగా ఉంటుందని, తమ రైతు పక్షపాత ప్రభుత్వమని రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. మంగళవారం నడిగూడెం, చిలుకూరు మండలాల్లో ఆయన పర్యటించారు. నడిగూడెం మండలంలోని కాగితరామచంద్రాపురం వద్ద జరుగుతున్న సాగర్ ఎడమ కాల్వ గండి మరమ్మతులను పరిశీలించారు.పనులను పూర్తి చేసి బుధవారం ఉదయం కల్లా నీటిని విడుదల చేస్తామని తెలిపారు. త్వరలో 1,800 మంది లష్కర్ల నియామకం చేపడుతామన్నారు. అనంతరం చిలుకూరు మండలంలో నారాయణపురం గ్రామంలో తెగిన చెరువు కట్టకు జరుగుతున్న మరమ్మతులను స్థానిక ఎమ్మెల్యే పద్మావతితో కలిసి పరిశీలించారు. చెరువు కట్ట మరమ్మతులకు రూ.కోటీ 50 లక్షలు మంజూరు చేయించామని, పది రోజుల్లో పనులు పూర్తి చేస్తామని తెలిపారు.అంతకుముందు రెడ్లకుంట మేజర్‌ను పరిశీలించారు. ఇటీవల వర్షాలకు దెబ్బతిన్న పంటలకు పరిహారం అందించి ప్రభుత్వం రైతులందరినీ ఆదుకుంటుందని హామీనిచ్చారు. కార్యక్రమంలో చీఫ్ ఇంజినీర్ రమేశ్‌బాబు, ఎస్ఈ శివధర్మతేజ, ఈఈ సత్యనారాయణ, ఆర్డీఓ సూర్యనారాయణ, తాసీల్దార్ ధ్రువకుమార్, డీఈ స్వప్న, ఏఈ మానస పాల్గొన్నారు.

